# వీరమల్లు వచ్చేది ఆరోజేనా?



అగ్ర హీరో పవన్‌కల్యాణ్ ఎట్టకేలకు 'హరిహరవీరమల్లు' సినిమా షూటింగ్‌ను పూర్తిచేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పాలనాపరమైన వ్యవహారాలతో బిజీగా ఉండటం వల్ల ఆయన సినిమా షూటింగ్స్‌లో జాప్యం జరుగుతున్న విషయం తెలిసిందే. 'హరిహర వీరమల్లు' షూటింగ్ అయితే పూర్తయింది... మరి రిలీజ్ డేట్‌ను ఎప్పుడు ప్రకటిస్తారో అంటూ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9న ఈ సినిమా విడుదల కావాల్సింది. అయితే కొంత షూటింగ్ పార్ట్ మిగిలి ఉండటంతో ఆ రోజు రిలీజ్ సాధ్యపడలేదు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ గురించి సోషల్‌మీడియాలో ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటికొచ్చింది. బుక్‌మైషో యాప్‌లో ఈ సినిమాను జూన్ 12న రిలీజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్యాన్స్ ఈ స్క్రీన్‌షాట్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ అదే రోజు సినిమా రిలీజ్ ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. అయితే బుక్‌మైషో పేర్కొన్న రిలీజ్ డేట్ నిజమా? కాదా? అనే విషయంలో స్పష్టత లేదు. చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వస్తేనే రిలీజ్ డేట్‌పై క్లారిటీ వస్తుందంటున్నారు. జ్యోతికృష్ణ ఈ చిత్రానికి దర్శకుడు.

# ప్రచారంలో వేగం పెంచిన కుబేర



తమిళ అగ్ర నటుడు ధనుష్ హీరోగా టాలీవుడ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న 'కుబేర' చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున ప్రత్యేక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే నెల 20న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటివరకూ విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమాకు చెందిన కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ధనుష్, రష్మిక ఇద్దరూ నవ్వుతూ కనిపిస్తున్న ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. రీసెంట్‌గా విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ 'పోయిరా పోయిరా మామ..' చార్ట్ బస్టర్ హిట్‌గా నిలిచిందని, ఈ పాటతో 'కుబేర'పై హైప్ నెక్ట్స్ లెవల్‌కి చేరుకుందని, దర్శకుడు శేఖర్ కమ్ముల నెవర్ బిఫోర్ అనిపించేలా సినిమాను తీర్చిదిద్దుతున్నారని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు చెబుతున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అమిగోస్ క్రియేషన్స్ ప్రై.లిమిటెడ్, ఎస్‌వీసీఎల్ఎల్‌పీ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# వృశ్చికం.. సస్పెన్స్ హారర్ థ్రిల్లర్



మంగపుత్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న సస్పెన్స్ హారర్ థ్రిల్లర్ 'వృశ్చికం'. యశ్విక కథానాయిక. శివరామ్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ గురువారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానంలో పూజాకార్యక్రమాలతో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి నటులు కోసూరి సుబ్రహ్మణ్యం కెమెరా స్విఛాన్ చేయగా, సుప్రీంకోర్ట్ అడ్వకేట్ హబీబ్ సుల్తానా క్లాప్ ఇచ్చారు. పరుచూరి గోపాలకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. సస్పెన్స్, థ్రిల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆకట్టుకుంటుందని, 45రోజుల్లో షూటింగ్ పూర్తి చేస్తామని, రామచంద్రాపురం, భద్రాచలం, హైదరాబాద్ ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతామని, అడ్వాన్స్ టెక్నాలజీతో సినిమా ఉంటుందని మంగపుత్ర తెలిపారు.

# 'ఆపరేషన్ సిందూర్' టైటిల్ కోసం..

## అగ్ర నిర్మాణ సంస్థల పోటీ




'ఆపరేషన్ సిందూర్' టైటిల్ హక్కుల కోసం బాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థలు పోటీపడుతున్నాయి. ఒకట్రెండు కాదు ఏకంగా 15 ప్రొడక్షన్ హౌస్‌లు ఈ టైటిల్ కోసం ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో దరఖాస్తు చేసుకోవడం విశేషం. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' లక్ష్యాన్ని సాధిస్తున్నది. పాక్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ దళాలు క్షిపణులతో ధ్వంసం చేస్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' టైటిల్ భారతీయ సంస్కృతిని, స్త్రీ సంకల్పాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన టైటిల్ కావడంతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పటికే చాలా మంది నిర్మాతలు ఈ టైటిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారని ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు బీఎన్ తివారీ తెలిపారు. మహావీర్ జైన్ ఫిల్మ్స్ ఈ టైటిల్ కోసం తొలి దరఖాస్తుని ఇచ్చిందని తెలిసింది. ప్రముఖ నిర్మాణ సంస్థలు జీ స్టూడియోస్, టీ-సిరీస్‌తో పాటు ప్రముఖ దర్శకుడు మధుర్ భండార్కర్ సైతం టైటిల్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని సమాచారం.

# 'దువా' అంటే ప్రార్థన అని అర్థం



గత ఏడాది సెప్టెంబర్‌లో ఓ ఆడబిడ్డకు దీపికా పదుకొణె జన్మినిచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అమ్మగా తాను అనుభవిస్తున్న మాతృత్వానుభవాల గురించి దీపిక మాట్లాడారు. 'తల్లిగా నేను అనుభవిస్తున్న ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఎంతో కష్టపడి సంపాదించుకున్న స్థానం ఇది. గర్భిణిగా ఉన్నప్పుడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా. ముఖ్యంగా 8,9 నెలల్లో అయితే చాలా కష్టం అనిపించింది. ఆ సమయంలో నాకు అండగా నా కుటుంబం, స్నేహితులు ఉండటం వల్లే ధైర్యంగా బిడ్డకు జన్మనివ్వగలిగాను. మా అమ్మాయికి మంచి పేరు కోసం అన్వేషించాం. చివరకు 'దువా' అని నామకరణం చేశాం. 'దువా' అంటే ప్రార్థన అని అర్థం.' అని తెలిపారు దీపిక. ఇంకా చెబుతూ 'ఓ వైపు తల్లిగా ఉండి, మరోవైపు షూటింగ్‌లలో పాల్గొనడం నాకు పెను సవాలుగా మారింది. మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ.. సినిమాను పక్కనపెడితే కెరీర్ పాడవుతుంది. అందుకే.. ఇక షూటింగులపై దృష్టి పెట్టాలనుకుంటున్నా. తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే షూటింగుల్లో పాల్గొంటా.' అని తెలిపారు దీపిక పదుకొణె.

# కర్మణ్యే వాధికారస్తే..



బ్రహ్మాజీ, శత్రు, మాస్టర్ మహేంద్ర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కర్మణ్యే వాధికారస్తే'. అమర్‌దీప్ చల్లపల్లి దర్శకుడు. డీఎస్ఎస్ దుర్గాప్రసాద్ నిర్మించారు. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైం, ఇన్వెస్టిగేషన్ చిత్రమిది. ఉత్కంఠభరితమైన కథ, కథనాలతో సాగుతుంది' అన్నారు. మంచి ఫిలాసఫికల్ పాయింట్‌తో తెరకెక్కించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇదని నిర్మాత పేర్కొన్నారు. బెనర్జీ, పృథ్వీ, శివాజీ రాజా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గ్యాని.


# క్రిష్ దర్శకత్వంలో బాలకృష్ణ?

## కుమారుడి ఎంట్రీ కూడా ఆ సినిమాతోనే?



ప్రస్తుతం బాలకృష్ణ 'అఖండ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా చేస్తారాయన. త్వరలోనే ఆ సినిమా షూటింగ్ మొదలు కానుంది. ఇదిలావుంటే.. తాజాగా బాలయ్య సినిమాల లైనప్ విషయంలో ఓ కొత్త వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఇటీవలే బాలకృష్ణను దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కలిశారట. వారిద్దరి కాంబినేషన్‌లో మూవీ కూడా దాదాపు ఖరారైందని సమాచారం. ఈ సినిమాను ఆర్కా మూవీస్ నిర్మించనున్నదని తెలుస్తున్నది. మలినేని సినిమాతోపాటే ఈ సినిమా షూటింగ్‌ను కూడా ఒకేసారి కానిచ్చేయాలని బాలకృష్ణ భావిస్తున్నారట. మరో విషయం ఏంటంటే.. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో బాలకృష్ణ నటించబోయే సినిమా ద్వారానే బాలయ్య కుమారుడు మోక్షజ్ఞ టాలీవుడ్ ఎంట్రీ కూడా ఉంటుందని తెలుస్తున్నది. కథలో ఓ కీలక భూమికను మోక్షజ్ఞ పోషిస్తారట. 30ఏండ్ల క్రితం ఒకేసారి రెండుమూడు సినిమాల్లో నటించేవారు బాలకృష్ణ. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. ఏడాదికి ఒక్క సినిమా చేస్తే గొప్ప. అయితే.. బాలయ్య మళ్లీ స్టైల్ మార్చారు. పాతరోజుల్ని గుర్తొచ్చేలా పనిచేయాలని నిర్ణయించారు. ఆయన అభిమానులకిది నిజంగా శుభవార్తే.

# 3000 మందితో 'కాంతార' యాక్షన్



రిషబ్‌శెట్టి కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'కాంతార' (2022) చిత్రం దేశవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించింది. ఆధ్యాత్మిక థ్రిల్లర్‌గా ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచింది. ప్రస్తుతం దీనికి 'కాంతార: చాప్టర్-1' పేరుతో ప్రీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. 'కాంతార'కు ముందు జరిగిన కథ ఇది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇటీవలే కర్ణాటక కుందాపూర్ సమీపంలోని అరణ్యంలో చివరి షెడ్యూల్‌ను ఆరంభించారు. అక్టోబర్ 2న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ ప్రీక్వెల్ షూటింగ్‌కు ఆది నుంచి అవరోధాలు ఎదురవుతున్నాయి. ఇటీవలే షూటింగ్ సందర్భంగా ఓ క్రూమెంబర్ నదిలో మునిగి చనిపోయారు. అంతకుముందు జూనియర్ ఆర్టిస్టులు ప్రయాణిస్తున్న బస్సు బోల్తాపడింది. గాలివానకు భారీ సెట్స్ నేలమట్టమయ్యాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలోని ఓ యుద్ధ ఘట్టం కోసం 500 మంది సుశిక్షితులైన ఫైటర్స్‌తో పాటు దాదాపు 2500 మంది జూనియర్ ఆర్టిస్టులను తీసుకున్నట్లు తెలిసింది. ఇలా 3000 మందితో యుద్ధ ఘట్టాన్ని తెరకెక్కించడం భారతీయ సినిమాలో ఇదే ప్రథమమని చెబుతున్నారు. ఈ సీక్వెన్స్ కోసం జాతీయ, అంతర్జాతీయ ఫైట్ కొరియోగ్రాఫర్స్ పనిచేశారని చిత్రబృందం చెబుతున్నది.

# నలందా విశ్వవిద్యాలయం నేపథ్యంలో..



జాతీయ, అంతర్జాతీయ నటీనటులతో మలయాళ దర్శకుడు సిధిన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఆఫ్ ఛేంజ్'. బెర్ల్ సింగర్, సిద్ధార్థ రాజశేఖర్, సురేంద్రన్ జయశేఖర్ తదితరులు ప్రధాన తారాగణం. ఈ నెల 14న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేశారు. 5వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నలందా విశ్వవిద్యాలయం నేపథ్యంలో నడిచే కథ ఇది. కొందరు చారిత్రక వ్యక్తుల నిజ జీవితాలతో రూపొందించాం. ప్రతి భారతీయుడు గర్వపడేలా ఉంటుంది. ఇలాంటి కథ ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ రాలేదు' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీరాజ్ సాజి, నిర్మాతలు: సిద్ధార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా, దర్శకత్వం: సిధిన్.













Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.